# వర్తమానం

-శ్రీ విరించి

'మిమ్మల్ని రేపు భోజనానికి పిలవాలనుకుంటున్నాను. మీకేం అభ్యంతరం లేదుగదా!' అనడిగింది కల్పన అతని ముఖంలోకి సూటిగా చూస్తూ. అప్పుడతను యేదో ఫైలులో కాగితాలు తిరగవేస్తూ గంభీరంగా వున్నాడు. తామిద్దరూ కూర్చున్నది ఆఫీసుగది - అనే విషయం అతనికి వెంటనే స్ఫురించింది. రెండు రోజులుగా అతను యిక్కడే వుండి పని చూసుకుంటున్నాడు. రేపు రాత్రి తిరుగు ప్రయాణం.

ఆమె మాటలు విని తలపైకి ఎత్తాడు. 'అలాగే, థాంక్స్' అన్నాడు పొడిగా. పదేళ్ళ తరువాత ఆమెను చూడవలసి వచ్చినందుకు అతనికేమీ పరితాపం లేదు. కొన్నాళ్ళు కలిసి పనిచేశాం, కలిసి కాపురం చేశాం - అభిరుచులు సరిపడక విడిపోవడమే మేలయిన పని అనుకున్నాం. ఇందులో కానిపని యేమీ లేదుగద!... సోమసుందరానికి ఈ ఆలోచన ఆమెను చూసిన మొదటిరోజునే వచ్చింది.

ఏదో కాకతాళీయంగా ఆమె అధికారిగా వున్న ఆఫీసుకు ఇన్‌స్పెక్షన్‌కు వచ్చాడతను. తరువాత ఎప్పుడేనా ఆమె తన ఆఫీసుకు తనిఖీకి వచ్చినా యేమీ ఆశ్చర్యం లేదు. ఉద్యోగాలలో యిటువంటి ఏర్పాట్లు ఎన్నయినా తటస్థించవచ్చును. అంతమాత్రంచేత ఒకళ్ళకన్న మరొకళ్ళు 'మిన్న' అనుకోవటానికి వీలులేదు.

భోజనం పేరు చెప్పి, తన ఉద్యోగ బాధ్యతలను గురించి తారుమారుగా, తాత్సారంగా యేమయినా వ్రాయిస్తుందా ఈ కల్పన - అన్న సందేహం అతనికి కలలో కూడా లేదు. ఆమెను గురించి అంతగా కాచి వడపోశాడు. రెండు రోజులుగా చూస్తున్న ఆఫీసు ఫైళ్ళలో 'నోటింగ్' లన్నీ కల్పన ధోరణికి అద్దం పడుతూనే వున్నాయి. ఈ పదేళ్ళలో ఆమె యేమీ మారలేదనడానికి అవే సాక్ష్యం.

'మళ్ళీ కలుస్తాను. మీ పని మీరు చూసుకోండి' అని కల్పన అతని జవాబు కోసం ఎదురు చూడకుండా బయటకు నడిచింది.

ఆమె వెడుతున్నప్పుడు సోమసుందరం మరేమీ మాట్లాడనేలేదు. తరువాత అతనికి ఆమెను గురించి ఆలోచించడం కొద్దిగానయినా అవసరమా - అనే ఆలోచన వచ్చింది.

భోజనానికి బయటకు తీసుకుపోతుందా - లేక ఇంటికే తీసుకు వెడుతుందా? - వేచి చూస్తే తప్ప తెలుసుకోవడం అసాధ్యం.

కల్పన అలాంటి ఆహ్వానం లాంటి ప్రశ్న వేయడానికి ముందు, కొంత సేపు ఆలోచించుకున్న మాట నిజమే.

సోమసుందరం తనకు యిప్పుడు యేమీ కాడు.

పాత పరిచయస్థుడిలా ఊరికే ఎగబడి మాట్లాడడం లేదు అతను, అందుకు అనుకూలం అయిన వాతావరణం సమకూడినా.

ఎవరి మనసులో ఎలాంటి వూహలుంటే తనకేం? - అతన్ని ఒక్కపూట భోజనానికి పిలిచి క్షేమ సమాచారాలు కనుక్కుని పంపించడం 'కనీస మర్యాద' అని కల్పన తీర్మానం చేసేసుకుంది.

అతను రానంటే తన ప్రతిపత్తి యేమయిపోతుంది? - దానికేమీ లోపం లేదు. అతనికి ఇష్టం అయితే అంగీకరిస్తాడు, లేకపోతే 'సారీ' అంటాడు. ఇందులో ఖేదపడవలసిన సంగతి ఏమీ లేదు.

మధ్యాహ్నం సరీగా ఒంటిగంటకు అతన్ని తన కారులో ఇంటికి తీసుకువచ్చింది. డోర్ బెల్ నొక్కినప్పుడు వంటమనిషి అంబుజం తలుపుతీసి అతనికి నమస్కారం చేసింది.

కల్పన అతన్ని డ్రాయింగ్ రూంలో కూర్చోమని, లోపలకు వెళ్ళింది.

'అంతా రెడీ అమ్మగారూ. మీరు చెప్పినవన్నీ

చేశాను–' అంది అంబుజం, ఆమెతో తగినంత తగ్గుస్వరంతో.

'చాల సంతోషం వడ్డించేసెయ్యి. రెండు నిమిషాలలో వస్తున్నాం–' అంది కల్పన.

డైనింగ్ టేబుల్ ముందు కూర్చుంటూ సోమసుందరం 'నా కోసం చాలా శ్రమ




తీసుకున్నారు–' అన్నాడు.

'ఇందులో శ్రమ లేదు. అంబుజం అద్భుతమైన వంటమనిషి. ఎవరు తిన్నా, ఎవరు తినకపోయినా బ్రహ్మాండమైన రుచిగా తయారు చేస్తుంది, యేం చేసినా' అంది కల్పన, అంబుజంకేసి ఆప్యాయంగా చూస్తూ.

సోమసుందరం ఆ యింట్లో యింకేం అలికిడి లేకపోవడం గమనించాడు. ఎవరూ లేరా! కల్పన ఒక్కత్తే వుంటుందా?

ఏ రకమయిన ప్రశ్నలు వేయడమూ అతనికి యిష్టం లేదు.

తను కేవలం అతిథి.

ఒక పూట భోజనం చేసి పోవటానికి ప్రత్యేక ఆహ్వానం మీద వచ్చిన వాడు. తన హోదా అంతే.

భోజనం ముందు కల్పన నాలుగయిదు మాటలు మాట్లాడింది. అంతే. అంబుజం అతనికి కొసరి కొసరి వడ్డిస్తోంది.

సోమసుందరానికి అనేక ప్రశ్నలు మనసులో ఊరుతున్నాయి. ఆ ఊటకు నోరు తోడు కావడం లేదు.

కల్పన ఆనందంగా హాయిగా వున్నట్లే అనిపిస్తోంది. కాని ఆమె అంతరంగంలో ఎలాంటి కదలికలూ లేవా?

ముఖ్యంగా తనను గురించి ఆమె యేమనుకుంటుందో తెలిస్తే బాగుండును. అలా తెలిసే విధానం కోసం వెదకడం అతనికి చేతకాదు.

భోజనం క్లుప్తంగా చేయడం అతనికి

చేతకాలేదు, ఎంత ప్రయత్నించినా! కల్పన అంబుజాన్ని గురించి చెప్పిన మాటలు అక్షరాల నిజం.

ఐస్ క్రీం కూడా తిన్న తర్వాత అంబుజం తమలపాకుల పళ్ళెం యిద్దరి మధ్య వుంచింది. నాలుగు ఆకులకు సున్నం రాసి యిస్తే వేసుకున్నాడు. తనకు సున్నం ఎంత రాసుకోవాలో తెలియదు. అనవసరంగా చాలసార్లు నాలుకకు యిబ్బంది తెచ్చుకున్నాడు. ఇప్పుడా ప్రమాదం లేకుండా కల్పన రక్షించింది. మనసులోనే ఆమెను మెచ్చుకున్నాడు.

ఏమీ మాట్లాడకుండా కూర్చోవడం కల్పనకూ కష్టంగానే వుంది. క్షేమ సమాచారాలు విచారించాలంటే యిదే తగిన సమయం.

'ఎన్నాళ్ళయింది మీరు యీ ఉద్యోగంలో చేరి?' అనడిగింది నాందిగా.

'రేపు మార్చికి మూడేళ్ళు పూర్తి అవుతాయి. ఎక్కువ కాంపులు తిరగడానికి వీలుగా వుంటుంది గనుక ఒప్పుకున్నాను-' అన్నాడు. ఎందుకు ఈ ఉద్యోగంలో చేరావు - అని ఆమె అడగలేదు అన్న విషయం గుర్తుకు వచ్చింది.

'ఎలా వున్నారు? ఆరోగ్యం బాగా వుంటోందా?'

ఏం జవాబు చెప్పాలో తక్షణం తోచలేదు సోమసుందరానికి.

అడిగింది యింతే చాలని తన తాపత్రయం అంతా యేకరవు పెట్టటం మర్యాద లక్షణం కాదు గద!

'ఫరవాలేదు. రోజులు వెళ్ళిపోతున్నాయి-' అన్నాడు కొద్ది విరామం తర్వాత.

కల్పన ముఖంలోకి సూటిగా చూస్తూ మాట్లాడడం కూడా చేతకావడం లేదు అతనికి. ఏదో బిడియం, సంకోచం; ఇది తప్పు చేశానన్న 'ఫీలింగ్' కాదు - తనకు తాను ధైర్యం చెప్పుకున్నాడు.

'మీ అమ్మ, నాన్న కులాసాగా వున్నారా?'

-సోమసుందరం గొంతు పొడి ఆర్చుకుపోయింది, ఈ ప్రశ్నకు సమాధానం చెప్పటానికి.

'లేదు. ఇద్దరూ ఆర్నెల్ల విరామంలో పోయారు. అప్పుడే అయిదేళ్ళు అయింది.' అన్నాడు.

'అయాం సారీ - అలానా పాపం!' అంది కల్పన.

ఆమె గొంతులో నిజంగానే విచారం వినిపించింది అతనికి.

అతని కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి.

'అలా విచారం పెంచుకోకండి. వయస్సు ఎవరినీ ఒంటరిగా వుంచదుగదా!'

'అవును. తనతో తీసుకువెడుతుంది-' అన్నాడు అతను నిర్లిప్తంగా.

కొద్ది నిమిషాలు నిశ్శబ్దంగా గడచిపోయాయి. సంభాషణ పొడిగించడం ఎలానో యిద్దరికీ తెలియలేదు.

'ఇంక సెలవు తీసుకోనా నేను' - అన్నాడు అతను.

'ఎక్కడికి వెడతారు. రూంకే గదా. ఓ గంట వుండి టీ తీసుకువెళ్ళండి'- అంది ఆమె.

అతను కూర్చున్న చోటనే అటు యిటు కదిలాడు.

ఆమె తనను గురించి యేమీ చెప్పడం లేదు. అంత యిబ్బంది కాని ప్రశ్నలు మాత్రమే వేస్తోంది. ప్రశ్నలు వేయడానికి మటుకు అతని మనస్సు మొండికేస్తోంది.

క్షేమ సమాచారాలు నాకెందుకు?

నా ఒంటరితనం ఎవరూ కదిలించలేరు.

సినిమాలు చూసేవాళ్ళకు, పుస్తకాలు చదివేవాళ్ళకు ఎన్నయినా వుంటాయి సంగతులు - మాట్లాడుకునేందుకు.

ఈ ఇద్దరూ ఆ రకం కాదు, అలా అని పూర్తిగా కాకపోనూలేదు.

'పోర్ట్ బ్లయర్‌లో వున్నాను కొంతకాలం-' అన్నాడు.

' ఆ దీవులు చాల అందంగా వుంటాయటగదా. అక్కడ నాగరికత బాగా పెరిగిపోయిందనీ, యిదివరకులాగ జీవిత ఖైదీలు మటుకే వుండడం లేదనీ విన్నాను.'

'అయినా శిక్షపడని ఖైదీలు చాలమంది ఉన్నారు అక్కడ. ప్రతి మనిషీ ఒక ఒంటరి ద్వీపం అనిపించింది నాకు అక్కడ వున్నన్నాళ్ళూ-'

'అవును. ఒక్కో మనిషీ ఒక "దీపం"- అంది

ఆమె సాలోచనగా.

'నేను ద్వీపం అన్నాను. మీరు దీపం అని మార్చేస్తున్నారు దాన్ని. అయినా నాకేం అభ్యంతరం లేదు–' అన్నాడు అతను.

'ఎవరికి వారే దీపకాంతి. ఆ వెలుగులోనే ప్రతివారూ నడవాలి, అన్నాడు బుద్ధుడు.'

'ఇంకా వేదాంతం పుస్తకాలు చదువుతూనే వున్నారా?' అనడిగాడు. అతని గొంతులో హేళన యేమీలేదు. కేవలం ప్రశ్న. బహుశ... తనకు తోచిన... పైకి వచ్చిన మొదటి ప్రశ్న.

కల్పన నవ్వింది.

'వేదాంతం కాదు... జీవితం' అంది

వాళ్ళు అలా పొడిపొడిగా – ముక్తసరిగా – మాట్లాడుకుంటూ వుండగానే అంబుజం టీ, బిస్కట్లు తీసుకువచ్చింది.

టాప్ బిస్కట్లు.

టాటా టీ.

ఈ రెండూ పుచ్చుకున్నాక ఉత్తేజం తెచ్చుకోకుండా వుండడం, అతనికి అసాధ్యం అయిపోయింది.

'చాల థాంక్స్. భోజనానికి పిలిచినందుకు–

'నేనే థాంక్స చెప్పాలి, మీరు అంగీకరించినందుకు–'

'నిన్న సాయంత్రం బజారుకు వెళ్ళి మీకు యేం కానుక యివ్వాలా అని చాలాసేపు కొట్టుమిట్టులాడిపోయాను. ఏం కొనాలో నాకు తెలియలేదు...'

'ఇంతకూ యేం కొన్నారు?'

అతను బ్రీఫ్‌కేస్ తెరిచాడు.

'అనుచితం అయితే నన్ను మన్నించాలి.'

'ఏమిటది?'

అతనో చిన్న ప్యాకెట్ అందించాడు ఆమెకు. 'చూడండి– మీకే తెలుస్తుంది.'

ఆమె ప్యాకింగ్ ఊడదీసి చూచింది.

ఒంటిరాయి ముక్కుపుడక. రాయంటే రాయికాదు. మరకతం. మెరిసిపోతోంది. ఆమె దానివంక తదేకంగా చూచింది.

అతను ఆమె ముఖం వంక దొంగతనంగా చూచాడు. ఆ ముఖంలో సంతోషం... ఆనందం... కనిపిస్తుందా అని వెదుకుతున్నాడు. కనిపించాయోలేదో తెలియదు గాని ఆమె మాత్రం 'చాలా థాంక్స్. మీకు గుర్తు వుండడం ఆశ్చర్యం–' అంది. ఒక్క నిమిషం ఆగి 'నేను మాత్రం మీకు యింత విలువయిన బహుమతి యివ్వలేను' అంటూ ఆమె లోపలికి వెళ్ళింది. ఆమె తనకు బహుమతి ఇస్తుందన్నమాటే అతనికి తోచలేదు. నిరాడంబరంగా ఆమె ఓ పెన్ సెట్, మఖమల్ కవర్ వేసిన ఓ నోట్‌బుక్ తీసుకు వచ్చింది. 'ఇదివరకు విదేశాలలో కాని దొరకని వస్తువులు ఇప్పుడు ఇండియాలో విరివిగా తయారవుతున్నాయి' అంటూ అతనికి అందించింది.

అతను రెండు చేతులతోను వాటిని అందుకున్నాడు.

కళ్ళకు అద్దుకున్నాడు.


'సెంటిమెంటల్ నాన్‌సెన్స్ అనుకున్నా సరే! ఈ పెన్‌తోనే ఈ నోట్‌బుక్‌లో కొత్త రచన చేస్తాను. నా హృదయం విప్పి ఈ బహుమతులకే చెబుతాను–' అన్నాడు.

'అలాగే చేయండి. మీరు అలా చేయాలనే నా కోరిక కూడా...' అంది ఆమె.

సోమసుందరం యాథాలాపంగా అన్నట్లుగా ఆమె ముఖం వంక చూచాడు.

అప్పుడే ఒంటిరాయి ముక్కుపుడక ఆమె ముఖానికి కొత్త అందాన్ని తీసుకువచ్చింది.

○



## అల్ప సంతోషి

తెరచాపంత తెలుగు దినపత్రికలో
ఆవగింజంత అక్షరాల నాపేరు
అబ్బో...! ఆహా...!! ఓహో...!!!
ఆనందమే ఆనందం...

–శిల్పా జగదీష్